# "నమ్ముచున్నాను" (11:1–57)

రచయిత నోట్: ఈ ప్రసంగం చేయకముందు వారంలో జేమీ గౌలెన్ అనే 23 ఏండ్ల సంఘ సభ్యుడు హార్డింగ్ యూనివర్సిటీ బెన్సన్ ఆడిటోరియమ్ పైనుండి క్రిందికి పడ్డాడు. అతడు పైకి ఎక్కిపోతూ ఉండగా అతని చేతులు జారి పలుచటి పెంకులు గుండా ఏభై అడుగుల ఎత్తునుండి గట్టి నేలమీద పడ్డాడు. అయినా ఎక్కడా దాదాపుగా గీచుకోకుండ భయంకరంగా పడిపోయికూడా తప్పించుకున్నాడు. మూడు దినాలు ఆస్పత్రిలో ఉండి యింటికి తిరిగి వచ్చాడు. ఇప్పుడు అతడు పరిపూర్ణమైన ఆరోగ్యంతో ఉన్నాడు. అయితే ఆ భయంకరమైన యాక్సిడెంట్ (ఆపద) తరువాత కొన్ని దినాలవరకు నేను ప్రతి ఆదివారం ప్రసంగించే స్థానిక సంఘం గాఢంగా కలతచెందింది. బాధాకరమైన ఆ వారం తరువాత జేమీ యొక్క ప్రాణం దక్కినందుకు దేవునికి కృతజ్ఞత చెల్లించే కూడికను సంఘం ఏర్పాటు చేసింది, అందులో ఆయనకు ప్రత్యేకంగా స్తుతిగానం చేయనుద్దేశించింది. దానికి ఫలితంగా, భక్తిపూర్వక – విధానంలోని ఈ ప్రసంగం అయిదు భాగాలుగా విభజింపబడి మధ్య మధ్య ప్రత్యేకమైన పాటలతో ఆపుతూ ఈ అద్భుతమైన లేఖన భాగంనుండి సత్యాలు ప్రకటింపబడ్డాయి.

---

ప్రేమ ఎల్లప్పుడు తిరిగి ప్రారంభించబడుతుంది! తల్లి ఒడిలో స్తన్యపానం చేస్తున్న పసితనంనుండి ప్రేమ తనకు తెలుసని ఒకరు అనుకోవచ్చు. యౌవనంలో ఉన్న స్త్రీ తన తొలి ప్రేమ కలాపాల్లో ప్రేమను కనుగొన్నట్టు తలంచవచ్చు. తాను పెండ్లి చేసికోగోరిన యువతిని అతడు కనుగొనినప్పుడు కట్టకడపటి ప్రేమను కనుగొన్నట్టు ఒక యువకుడు తలంచవచ్చు. తల్లిదండ్రులు తమకు క్రొత్తగా పుట్టిన బిడ్డను చేతుల్లో ఎత్తిపట్టుకొన్నప్పుడు ప్రేమ పరిపూర్ణమైనదిగా వారు భావించవచ్చు. వేరొకనివలన భయంకరమైన దుర్దశను అనుభవించిన తరువాత చివరిగా మనం ప్రేమను నిజ రూపంలో కనుగొన్నామని తలంచవచ్చు. ప్రేమకు ఎల్లప్పుడు ఆరంభమున్నట్టు కన్పిస్తుంది.

## నమ్మికకు ఎల్లప్పుడు ఆరంభముంటుంది (11:15)

ప్రేమకువలె విశ్వాసానికి కూడా ఎల్లప్పుడు ఆరంభమనేది ఒకటి ఉంటుంది. ఉదాహరణకు, యోహాను సువార్తలో, మనం 11వ అధ్యాయానికి చేరుకునేవరకు, శిష్యులు ప్రభువైన యేసునందు విశ్వాసముంచియున్నారు. బాప్తిస్మమిచ్చు యోహానును విడిచి యేసును అనుసరించిననాడే అంద్రెయ ఆయనయందు విశ్వాసముంచాడు (1:41). ప్రభువు తన్ను పిలిచిన రోజునే ఫిలిప్పు ఆయనయందు విశ్వాసముంచాడు (1:45), అంజూరపు చెట్టు క్రింద ఉన్నప్పుడే తనను చూచానని యేసు చెప్పినప్పుడే నతనియేలు ఆయనయందు విశ్వాసముంచాడు (1:49). కానా పెండ్లి విందులో ఆయన నీటిని ద్రాక్షారసంగా మార్చినప్పుడు వివాహమునకు వచ్చిన శిష్యులు ఆయనయందు

విశ్వాసముంచారు (2:11). అయిదు వేలమందికి (అయిదు రొట్టెలు రెండు చిన్న చేపలతో) ఆహారము పెట్టిన దాన్ని చూచి, జీవాహారము అనే చర్చను విన్న పేతురును యితర శిష్యులును విశ్వసించినట్టు చెప్పుకున్నారు (6:69). విశ్వాస సంబంధమైన ఈ ప్రతిపాదనలన్నిటి తరువాత కూడా, వారు "నమ్మునట్లు" లాజరును లేపే అవకాశానికి తాను సంతోషించుతున్నట్టు యేసు తన శిష్యులకు తెలియజేశాడు (11:15)!

ఆ విధంగా – విశ్వాసం ఎల్లప్పుడు ఆరంభంగానే ఉంటుంది. కనీసం కొంతవరకైనా, మనలో ఎక్కువమంది విశ్వసించియున్నాం. ఒకనాడు, ఎంతో జీవితాన్ని మార్చేదిగా ఒకదానిని ఎదుర్కొంటాం, ఆ విధంగా విశ్వాసాన్ని మరెన్నడూ చూడం. ఆలాటి ఎదుర్కోలు దీవెన కావచ్చు లేక శోధనయే కావచ్చు, అది బిడ్డ పుట్టడమే కావచ్చు, లేక ఏభై అడుగుల ఎత్తునుండి పడిపోవడమే కావచ్చు. హఠాత్తుగా, ప్రతిదాన్ని మనం వేరుగా చూస్తాం, విశ్వాసము తిరిగి ఆరంభమైనట్టు కన్పిస్తుంది!

నమ్మమని యోహాను సువార్త నేడు మనకు పిలుపునిస్తుంది (20:31). ఆ పిలుపును విన్న మనలో అనేకులం, "నేను యింతకు ముందే విశ్వసించాను" అని తలంచవచ్చు. ఏదియెలాగున్నా, మనం ఆలకించి, వెదకి వెంబడించినట్టయితే, విశ్వాసం మనలో కేవలం ఆరంభం మాత్రమేనని మనం కనుగొనవచ్చు!

## విశ్వాసము వాగ్దానంతో నిండియున్నది (11:25, 26, 40)

బేతనియకు వెలుపల మార్త ప్రభువును కలిసికొన్నప్పుడు, ఆమె సోదరుడు నాలుగు దినాలుగా సమాధిలో ఉన్నాడు, ఆయన అక్కడ ఉండియున్నట్టయితే, తన సోదరుడు మరణించకుండ ఉండేవాడని ఆమె విలపించింది. ఆమె దుఃఖానికి బదులుగా, యేసు "-పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు. ఈ మాట నమ్ముచున్నావా? అని ఆమెను అడిగెను" (11:25, 26). ప్రభువైన యేసు విశ్వాసానికి బలమైన సంకల్పాన్నిస్తాడు. విశ్వాసమనేది కష్టమైన పని, సోమరియైనవాడు ప్రయాసను తీసికోడు. విశ్వసింపగోరతాము గనుక మనం విశ్వసింపము, (విశ్వసించడం అనేది కోరిక కాదు), అయితే మనం విశ్వసింపగోరనియెడల ఎన్నడూ విశ్వసింపము. విశ్వాసం సమర్పణ, విధేయత, త్యాగము మరియు అనేక పర్యాయములు కన్నీళ్లతో కూడినదై ఉంటుంది. ఏదియెలాగున్నా, విశ్వసించినవారికి గొప్ప వాగ్దానం ఇవ్వబడింది.

ఈ విషయంలో, విశ్వాసమనేది కళాశాలలో చేసే కష్టమైన పనివలె ఉంటుంది. విద్యార్థి మంచి ఉద్యోగం సంపాదించుకుంటాననే ఉద్దేశంతో కష్టపడి చదువుతాడు. ఒకడు ఉద్యోగంలో కష్టించి పని చేస్తే మంచి జీతంగాని, ప్రమోషన్‌గాని వస్తుంది. దీని విషయంలో పొరపాటు చేయవద్దు సుమీ: విశ్వాసం ప్రతిఫలాన్ని సంపాదించుకోదు అయితే దేవుని వాగ్దానాలు దీర్ఘమైన, కష్టమైన, కొన్నిసార్లు విశ్వాసపు త్రోవలో పయనించేలా చేస్తాయి.

## విశ్వాసము యేసుపై కేంద్రీకరించబడుతుంది (11:27, 42)

యోహాను విశ్వాసము మనలను క్రీస్తునందలి విశ్వాసంవైపు మళ్లిస్తుంది. మనకు కావలసింది తల్లిదండ్రులయందు విశ్వాసము కాదు, అపొస్తలుల విశ్వాసం కాదు, యితర క్రైస్తవులయందు విశ్వాసం కాదు, సంఘమునందు విశ్వాసం కాదు, కడకు విశ్వాసము నందు విశ్వాసం కాదు. మనకు యేసునందు విశ్వాసం అవసరం.

మార్త యొక్క బలమైన విశ్వాసపు ప్రతిపాదనలో ఆమె ప్రభువుతో యిలా పలికింది: "అవును ప్రభువా, నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని **నమ్ముచున్నాను** ..." (11:27; ఒత్తి పలకడం నాది). ప్రభువైన యేసును, ఆయన శిష్యులును, మార్త, మరియ, విలపించే జనుల గుంపును లాజరు సమాధి వెలుపల నిలువబడినప్పుడు, "నీవు ఎల్లప్పుడును నా మనవి వినుచున్నావని నేనెరుగుదును గాని నీవు నన్ను పంపితివని చుట్టు నిలిచియున్న యీ జనసమూహము నమ్మునట్లు వారి నిమిత్తమై యీ మాట చెప్పితినని" ఆయన తండ్రియైన దేవుని ప్రార్థించాడు (11:42). "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు" అనే (20:31) విశ్వాసాన్ని కలిగించే ఉద్దేశము కలిగిన యోహాను సువార్త తక్కిన దానితో పొందిక కలిగియుంది.

జాన్ పాటన్ ఆఫ్రికాకు మిషినెరీగా వెళ్లి బోధించి అనేకులకు బాప్తిస్మమిచ్చాడు. తాను ఏ జనులకు ఉపదేశిస్తున్నాడో ఆ జనుల భాషలో బైబిలు లేనందున, పాటన్ బైబిలును ఆ భాషలోనికి తర్జుమా చేసే దీర్ఘమైన కష్టమైన పనిని ఆరంభించాడు. "విశ్వసించు" అనే మాట దగ్గరకు వచ్చేవరకు పని మంచిగాను, సజావుగాను జరిగిపోయింది. "విశ్వసించు" అనేదానికి ఆ భాషలో పదం లేదంటే ఆశ్చర్యంగానే కన్పిస్తుంది. "విశ్వసించు" అనే పదం లేకుండ ఎవరైనా బైబిలును ఎలా తర్జుమా చేయగలరు?

అప్పుడు, ఒక రోజున పాటన్ భాషా సమస్యతో సతమతమౌతుండగా, ఒక గ్రామంనుండి క్రైస్తవుడొకడు అతని వద్దకు వచ్చాడట. అతడు రోజంతా పనిచేసి అలసినవాడై వచ్చాడట. అతడు కుర్చీమీద కూర్చున్నప్పుడు విరామపు నిట్టూర్పు విడిచి, "ఏదో ఒకదాని మీద నీ బరువంతా ఆనించడం ఎంతో మంచిది" అని అన్నాడట. "విశ్వసించు" అనేదానికి ఒక ప్రయోగం కనుగొన్నట్టు పాటన్ గ్రహించాడు. విశ్వసించడమంటే, "నీ బరువంతా యేసుపై యుంచడం"[1] విశ్వాసము క్రీస్తు మీద కేంద్రీకరించబడింది, అల్పమైన దానిమీద కాదు.

## విశ్వాసము విభజిస్తుంది (11:45, 46)

లాజరు సమాధికి వెలుపట జనులు నిలిచియుండి అతడు బయటికి సజీవంగా నడచి వచ్చుట తిలకించగా, తప్పించుకొనజాలని పిడిగల చేతి కర్ర వంటిదొకటి వారికి యివ్వబడింది. లాజరు చనిపోగా వారు చూచారు, భూస్థాపనకు వారు అతని మృత దేహాన్ని సిద్ధపరచారు, ఒక సమాధిలో దానిని ఉంచారు, ఆ గుహ ముఖ ద్వారానికి రాతిని సహా పొర్లించారు. ఈ సంఘటనలన్నిటికి వారు సాక్షులైయున్నారు. తరువాత,

ప్రభువైన యేసు చేసిన అద్భుతాన్నిబట్టి, అదే జనులు అతడు బ్రదికింపబడడానికి కూడా సాక్షులై నిలిచారు! వారు నమ్ముతారా? తీర్మానం చేసికోకుండ వారు ఉండలేరు.

ఆ దినమున జరిగిన అద్భుతమును చూచిన వారి మధ్య విభజన జరిగినట్టు యోహాను యిలా దాఖలు చేశాడు:

> కాబట్టి మరియయొద్దకు వచ్చి ఆయన చేసిన కార్యమును చూచిన యూదులలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి కాని వారిలో కొందరు పరిసయ్యుల యొద్దకు వెళ్లి యేసుచేసిన కార్యములను గూర్చి వారితో చెప్పిరి (11:45, 46).

వింతగా, ఈ ప్రజలందరు జరిగిన సంభవాలను కన్నులారా చూచారు కాని వ్యతిరేకమైన దిశలుగా వారు ప్రతిచర్యను చేశారు. దేవుని శక్తి ఎదుట తామున్నట్టు కొందరు చూచారు గనుక ఆ దినమున వారు యేసునందు విశ్వాసముంచారు. ఇతరులైతే ఉబుసుపోక కబుర్లలోని ఆసక్తికరమైన విషయాన్ని "గమనించి" యెరూషలేముకు వెళ్లి క్రీస్తు కావించిన కలవరాన్ని గూర్చి యూదా మత నాయకులకు చెప్పారు. ప్రజల మధ్య జరిగిన విభజన ఆ కథలో త్రోసిపుచ్చే భాగమేమీ కాదు. దానికి భిన్నంగా విభజనే క్రీస్తు కథలో ముఖ్య స్వభావమై ఉంది: ప్రభువైన యేసును గూర్చి జనులు విన్నప్పుడు, ఆయన నిజమైన గుర్తింపును గూర్చి ఏదో ఒక విధంగా తీర్మానం చేసికొనేలా జనులు నిర్దేశింప బడతారు – అందులో తటస్థ విధానమేమీ లేదు.

ప్రభువైన యేసును, అపొస్తలుడైన యోహానును ఆ తీర్మానానికి పట్టువదలక మనలను నెట్టుతూ ఉంటారు: యేసు దేవుని కుమారుడా, లేక ఆయన మోసగాడా? ఆయన దైవమైనా అయ్యుండాలి, లేదా మరణానికి పాత్రుడైయున్న దేవ దూషకుడైనా అయ్యుండాలి. నీ తీర్మానమేమి?

## విశ్వాసము భీతి కలిగిస్తుంది (11:48)

లాజరు మృతులలోనుండి లేపబడడాన్ని కాంచిన కొందరు యెరూషలేములోని ప్రధానయాజకుల వద్దకును, పరిసయ్యుల వద్దకును వెళ్లి నజరేతునుండి వచ్చిన బోధకుడు చేసిన దానిని గూర్చి వివరించారు. వీరు ఆ విషయాన్ని వారికి అందించగా, "మనమాయనను ఈలాగు చూచుచు ఊరకుండినయెడల అందరు ఆయనయందు విశ్వాస ముంచెదరని" చెప్పిరి (11:48). యేసునందలి విశ్వాసము జీవితాలను మార్చుతుంది, కుటుంబాలను మార్చుతుంది, కడకు దేశాన్నే మార్చుతుందని వారు గుర్తెరిగారు. నేడు క్రైస్తవులనేకులకంటె వారే శ్రేష్ఠంగా ఎరిగారా ఏమి అన్నట్టు యిది అనిపిస్తుంది. – విశ్వాసము ఎంత భయంకరమైనది! ప్రేమను గూర్చి ఒక పాత కీర్తన యిలా అంటుంది, "అది నిన్ను పైకెత్తుతుంది, ఎన్నడు నిన్ను నిరాశపరచదు, నీ లోకాని తీసికొని చుట్టూ త్రిప్పుతుంది" యేసునందలి విశ్వాసాన్ని గూర్చి కూడా అదే సంగతి చెప్పవలసియుంటుంది.

నేటి ప్రజల తత్వమేమంటే, విశ్వాసంనుంచి చాలా తక్కువ అపేక్షించబడుతుంది. విశ్వాసం అంటే బహు తేలికైనది, బహు మృదువైనది, ఎక్కువగా కోరనిదని నేటి ప్రజల

అభిప్రాయం. ఈ క్రింది వ్యంగ్యమైన పేరాగ్రాఫులో విల్‌బర్‌రీస్ ఈ తత్వాన్ని వ్యక్తపరచుతున్నాడు:

> మూడు రూపాయల విలువకు నేను దేవుని కొనాలి, ప్లీజ్. నా ఆత్మను పెద్ద ధ్వనితో పేల్చడానికిగాని, లేదా నా నిద్రను చెరపడానికిగాని చాలినంత వద్దుకాని, ఒక కప్పు వేడి పాలకు సమానమైనంత లేదా సూర్యకాంతిలో ఒక కొనకు అంత చాలు. ఒక నల్ల మనిషిని ప్రేమించునంతగా గాని, లేదా వలసవచ్చినవానితో కలిసి తిరిగే అంతగా గాని ఆయన నాకు అక్కరలేదు. నాకు ఉల్లాసం కావాలి, రూపాంతరం వద్దు; గర్భం యొక్క ఆప్యాయత నాకు కావాలి, క్రొత్త జన్మ వద్దు. కాగితపు సంచిలో నాకు ఒక పౌను నిత్యత్వం కావాలి. మూడు రూపాయల విలువకు నేను దేవుని కొనాలి, ప్లీజ్.[2]

యేసు దేనికి మనలను ఆహ్వానిస్తున్నాడో, ఆ విశ్వాసం మన జీవితాలన్నింటిని మార్చివేయవచ్చు. యేసును అనుసరించడానికయ్యే వెల ఎంతో మనం నిశ్చయంగా అర్థం చేసికోవాలని యోహాను కోరుతున్నాడు. మనం బాధింపబడవచ్చు, శ్రమపెట్ట బడవచ్చు, మనకు కలిగియున్న సమస్తాన్ని సహా మనం పోగొట్టుకోవచ్చు. మనకు అనుగ్రహింపబడే విశ్వాసపు వాగ్దానాలతో పోల్చితే, దానికై చెల్లించే వెల ఎంతగానో అల్పమైనదై ఉంటుంది.

---

సూచనలు

[1]King Duncan, "Faith," *Dynamic Illustrations* (Knoxville, Tenn.: Seven Worlds Press, January/ February 1995). [2]Quoted in Charles Swindoll, *Improving Your Serve* (Waco, Tex.: Word Publishing Co., 1981), 29.